# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా దేశం ఆయనకు ఘనంగా నివాళులర్పించింది.**

**2. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నేకల్లులో పర్యటిస్తున్నారు.**

**3. గడిచిన పది నెలల కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎన్నో ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టామని కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు.**

**4. రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.**

==========================

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా దేశం ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, రాజ్యసభలో సభాపక్ష నేత జేపీ నడ్డా, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్రమంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

--------------------------

ఆధునిక భారత సమాజ నిర్మాణానికి పునాదులు వేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలను ఆయన జయంతి సందర్భంగా స్మరించుకుందామని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రిగా, స్వాతంత్రోద్యమ వీరుడిగా దేశానికి ఆ మహానుభావుడు అందించిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఆయనకు హృదయపూర్వకంగా అంజలి ఘటిస్తున్నానని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకు భరోసా కల్పిస్తామని.. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. భారతీయ సమాజానికి అంబేద్కర్ సూచించిన మార్గం ఎప్పటికీ ఆదర్శప్రాయంగా నిలిచిపోతుందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా లోకేశ్ ఆయనకు ఘనంగా  నివాళులర్పించారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నేకల్లులో పర్యటిస్తున్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విదేశీ విద్యా పథకం ద్వారా రుణాలు పొంది విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో ఆయన వర్చువల్‌గా సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మార్గదర్శి- బంగారు కుటుంబాల సభ్యులతో సమావేశమవుతారు.

---------------------------

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలు భావితరాలకు స్ఫూర్తి గా నిలుస్తాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 134వ జయంతి వేడుకల సందర్భంగా శ్రీకాకుళం నగరంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అంబేద్కర్ న్యాయవేత్తగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా దేశానికి చేసిన ఎనలేని సేవలను వెలకట్టలేమని కొనియాడారు. అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయనకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు నివాళులు అర్పించారు.

---------------------------

గడిచిన పది నెలల కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎన్నో ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టామని కార్యనిర్వహణాధికారి జె.శ్యామలరావు తెలిపారు. శ్రీవారి భక్తుల మనోభావాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరిచామని ఆయన చెప్పారు. ఈరోజు తిరుమలలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గోశాల నిర్వహణ సరిగా లేదని, దాణా పేరుతో నిధులు దుర్వినియోగం అయ్యాయని వెల్లడించారు. టీటీడీ గోశాలలో 100 గోవులు చనిపోయాయని జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదన్నారు. కల్తీ నెయ్యి కేసులో ఇద్దరు టీటీడీ ఉద్యోగుల పాత్ర ఉందని విచారణలో తేలిందని శ్యామలరావు వివరిస్తూ..

...వాయిస్... 35 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆర్పీ సిసోదియా.. చేనేత, జౌళి పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ అయ్యారు. భూ పరిపాలన ప్రధాన కమిషనర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయలక్ష్మికి.. రెవెన్యూశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్‌కు మానవ వనరుల అభివృద్ధి శాఖ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

అలాగే, పంచాయతీరాజ్, గ్రామాణాభివృద్ధి శిక్షణ సంస్థ కమిషనర్‌గా ముత్యాలరాజును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రైతు బజార్ల ముఖ్య కార్యనిర్వహణాధికారిగా కె.మాధవీలత, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శిగా గౌతమి, ఆయుష్ డైరెక్టర్‌గా దినేష్ కుమార్, వైద్య, ఆరోగ్య

కుటుంబ సంక్షేమ శాఖలోని ఎయిడ్స్ నియంత్రణ సంఘం మేనేజింగ్ డైరెక్టర్‌గా నీలకంఠారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం గువ్వలచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీదును నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు అనేక పథకాలు అమలు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తోందని చెప్పారు. రాయచోటి నియోజకవర్గంలో ఎక్కువ మంది మైనార్టీలు ఉన్నారని అర్హులందరికీ పథకాలు అందేలా చూస్తానని మంత్రి స్పష్టంచేశారు.

---------------------------

అమెరికా ఆంక్షలతో ఆక్వా రైతులు ఆందోళన చెందనవసరం లేదని, మన ప్రాంత ఆక్వా ఉత్పత్తులకు ప్రపంచ దేశాల్లో డిమాండ్ ఉందని శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు తెలిపారు. ఉండిలో నిన్న జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వా రైతుల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆక్వా కల్చర్ సుస్థిరం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో చర్యలు చేపడతామని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రొయ్యలు సాగు చేసే రైతులు భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు, యాంటీ బయోటిక్స్ నియంత్రించి ఉత్పత్తులు పెంచే విధంగా కృషి చేయాలని రఘురామకృష్ణరాజు సూచిస్తూ...

వాయిస్ .. 33 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మి కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 19 సెకన్లు....

---------------------------

రాష్ట్రం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు వివిధ దేశాలకు ఎగుమతులు సుమారు 9 వేల కోట్ల రూపాయలు పెరిగాయి.

====================